క్లుప్తంగా

ఇళ్లు కేటాయించాలని వినతి

విశాఖ విద్య: హుద్‌హుద్ తుపాను బాధితులకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బలివాడ వెంకట్రావు, జీవీఎంసీ 78వ కార్పొరేటర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ విజయ భాస్కర్‌కు బాధిత లబ్ధిదారులతో కలసి వినతి పత్రం అందజేశారు.

గోపాలపట్నం తహసీల్దార్‌గా విజయ్ భాస్కర్



విశాఖ విద్య: గోపాలపట్నం మండల తహసీల్దార్‌గా పి. విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా మెరక ముడిదాం తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన్ను ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించారు. విజయ భాస్కర్‌కు గోపాలపట్నం తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు విజయ భాస్కర్ విధుల్లో చేరారు. ఆయన్ను ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్‌ఐ సురేష్ కుమార్, సిబ్బంది సాదరంగా ఆహ్వానించారు. మండలంలో రెవెన్యూ పరంగా పరిస్థితులు, ఎన్నికల వ్యవహారాలపై సిబ్బందితో సమీక్షించారు.

గోపాలపట్నం సీఐ సురేష్ బాధ్యతల స్వీకరణ



సీఐ సురేష్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న సంతోష్

గోపాలపట్నం: గోపాలపట్నం శాంతి భద్రతల విభాగం సీఐగా కె. సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు బదిలీ అయిన సీఐ సంతోష్ కుమార్ చార్జి అప్పగించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్‌కు స్టేషన్ ఎస్‌ఐ అప్పలనాయుడు, ఏఎస్‌ఐ అప్పారావు సిబ్బంది శాలువతో సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డుపైనే బిల్డింగ్ మెటీరియల్



ప్రధాన రోడ్డుపై ఉన్న మెటీరియల్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ ప్రధాన రహదారిలో భవన నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ వేస్తుండడంతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రోడ్డు సగానికి పైగా మూసేలా ఇసుక, కంకర వేస్తున్నారు. దీని వల్ల ఇబ్బందులు పడుతున్నామని వాహన దారులు వాపోతున్నారు. రోజులు తరబడి ఇలానే మెటీరియల్ రహదారులపై వదిలేస్తుండటంతో తీవ్ర అసౌకర్యంగా ఉంటుందని ఇరుగు పొరుగు ఇళ్ల వారు సైతం ఫిర్యాదులు చేస్తున్నారు. అధికారులు ఇలాంటి వాటిపై దృష్టి సారించి, భవన నిర్మాణ దారులకు తగిన హెచ్చరికలు చేయాలని కోరుతున్నారు.

మర్యాద పూర్వక కలయిక



హర్షవర్ధన్‌కు బొకే అందజేస్తున్న పారిశ్రామిక ప్రాంత జేసీఎస్ నాయకులు


మల్కాపురం: పలు సమావేశాల్లో పాల్గొనేందుకు శుక్రవారం నగరానికి వచ్చిన రాష్ట్ర జేసీఎస్ ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డిని పారిశ్రామిక ప్రాంత జేసీఎస్ కన్వీనర్లు భోగవల్లి నాగభూషణం,పిల్లా కన్నబాబులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా కప్పి,పుష్ప గుచ్ఛం ఇచ్చారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో వీరంతా పాల్గొన్నారు.

సాకారం దిశగా.. 40 ఏళ్ల కల

- పట్టాల సమస్యను పరిశీలించాలని కలెక్టర్‌కు లేఖ
- ఆడారి ఆనంద్ కుమార్ కృషితో కదలిక
- సంతోషం వ్యక్తం చేస్తున్న కంపరపాలెం వాసులు
- మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ నిర్వాసితులు
- సుమారు 523 కుటుంబాలకు లబ్ధి



కంపరపాలెం



పద్మనాభనగర్ వ్యూ

గోపాలపట్నం: ఆ ప్రాంత వాసుల 40 ఏళ్ల కల సాకారం కానుంది. దీంతో ఆయా కాలనీ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కంపరపాలెం, పద్మనాభనగర్, ఎస్సీబీసీ కాలనీ, నందమూరి నగర్, జనతా కాలనీ ప్రాంతాల వారు తమ సమస్య పరిష్కారం కానుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవ చూపించడంపై ఈ ప్రాంత వాసుల ఆనందానికి అవదుల్లేకుండా ఉన్నాయి. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌కు ప్రభుత్వం నుంచి లేఖ రావడంతో వారు సంబరపడుతున్నారు.

ఆస్తి ఉన్నా..

మేహాద్రి గెడ్డ నిర్మాణానికి పద్మనాభనగర్ వాసులు 1975లో, కంపరపాలెం గ్రామస్తులు 1982లో తమ ఇళ్లు, భూములు ఇచ్చారు. వారికి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో పద్మనాభనగర్ వాసులకు 76, 76ఏ సర్వే నంబర్లలో 308 పట్టాలు, కంపరపాలెం వాసులకు 70, 71, 73 సర్వే నంబర్లలో 215 ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అదే మాదిరిగా 1985లో గృహ నిర్మాణ సంస్థ వద్ద రుణం పొంది ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. మొత్తంగా 523 మందికి పట్టాలు అందించారు. ఎస్సీబీసీ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ పట్టాలు కూడా లబ్ధిదారుల అవసరాలకు ఉపయోగపడని విధంగా ఉన్నాయి. దీంతో కుటుంబ అవసరాలకు తనఖా పెట్టుకోవాలన్నా, అమ్మకోవాలన్నా వీల్లేకుండా పోయిందని వాపోతున్నారు. 40 ఏళ్లు అవుతున్నా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. పట్టాలు తాతలు, తండ్రుల పేరిట ఉండడంతో వారసుల పేరున రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది.

ఆడారి ఆనంద్ కుమార్ చొరవతో...

కొద్ది నెలల కిందట గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈప్రాంతానికి వచ్చిన వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ద్వారా గ్రామస్తుల సమస్యను వివరించారు. దీంతో ఆనంద్‌కుమార్ ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ప్రభుత్వం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా ఇక్కడి సమస్యను పరిష్కరించాలని సూచించింది. దీంతో అడుగంటిన తమ ఆశలకు ఇన్నాళ్లకు ఊపిరి పోసినట్లయిందని ఇక్కడి నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం దిశగా..



ఈ ప్రాంత వాసుల ఇళ్ల పట్టాల సమస్య 40 ఏళ్ల నుంచి ఉంది. ఎంతో మంది నాయకులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయింది. బెహరా భాస్కరరావు ద్వారా ఆడారి ఆనంద్‌కుమార్‌కు మా బాధలు వివరించాం. దీంతో ప్రభుత్వం స్పందించి మాలో ఆశలు కల్పించింది. కలెక్టర్ ద్వారా మా ఇళ్ల పట్టాలకు సంపూర్ణ హక్కు కల్పిస్తే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– కంపర రామకృష్ణ, కంపరపాలెం

మా తాతల నాటి సమస్య



ఇక్కడి ఇళ్ల పట్టాల సమస్య మా తాతల నాటిది.దీనిపై జగనన్న ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మా బాధలు విని పరిష్కరించే దిశగా అడుగులు వేస్తోంది. ఇది చాలా సంతోషకరమైన విషయం. సంపూర్ణ హక్కు కల్పిస్తే ఉంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– రావర్తి దేవి, కంపర పాలెం

ఎంతో మందికి మేలు



గతంలో ఇచ్చిన పట్టాలకు ఎటువంటి హక్కులు కల్పించ లేదు. మా వద్ద నుంచి ఇళ్ల స్థలాలు తీసుకుని ఎందుకూ పనికిరాని స్థలాలు ఇచ్చి పట్టాలు చేతిలో పెట్టారు. కష్టకాలంలో కుదువ పెడదామన్నా కొరవడకుండా పోతున్నాయి. ఈ ప్రభుత్వం సంపూర్ణ హక్కు పథకం ద్వారా నైనా మాకు మేలు జరుగుతుందని ఆశిస్తున్నాం.

– కంపర మహాలక్ష్మి, కంపరపాలెం

జగనన్ననే నమ్ముకున్నాం



జగనన్ననే నమ్ముకున్నాము. 40 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉన్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది. అధికారులు దయతో మా ఇళ్ల పట్టాల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాం.

– కంపర రాజ్యలక్ష్మి, కంపర పాలెం

ఉన్న పట్టాలు అలంకారమే..



మాకు ఇచ్చిన ఇళ్ల పట్టాలు అలంకారంగా ఉన్నాయి. ఇవి ఆస్తులుగా మారాలని కోరుతున్నాం. మా ఆశయం ఇన్నాళ్లకు నెరవేరబోతోంది. ఇందుకు బెహరా భాస్కరరావు, ఆడారి ఆనంద్ కుమార్‌కు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞులమై ఉంటాం. ఈ సమస్య పరిష్కారమైతే మాతో పాటు ఈ ప్రాంతంలో సుమారు 900 మంది లబ్ధి పొందుతారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా రిజిస్ట్రేషన్లు జరిగితే సంబరాలు చేసుకుంటాం. తామంతా జగన్‌కే మద్దతుగా నిలబడతాం.

– కంపర కోటేశ్వరరావు, కంపరపాలెం

డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణ దారులతో మాట్లాడుతున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లో డ్రైనేజీలను ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలు తొలగించడానికి కార్పొరేషన్ సిబ్బంది సిద్ధమయ్యారు. సచివాలయ టౌన్ ప్లానింగ్ అధికారి రామకృష్ణ ఆదేశాల మేరకు డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగిస్తున్నట్టు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ అహ్మద్ తెలిపారు. జీవీఎంసీ స్క్వాడ్ సిబ్బందితో కలసి శుక్రవారం శాంతినగర్‌లో డ్రైనేజీలపై నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించారు. అయితే దుకాణదారులు వారికి అడ్డం పడ్డారు. గతంలోనే ముందుస్తు హెచ్చరికలు జారీ చేసి దుకాణాలు తీసేయాలని చెప్పటం జరిగిందని ప్లానింగ్ సెక్రటరీ అహ్మద్ తెలిపారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించే క్రమంలో జేసీబీ రాకపోకలకు దుకాణాలు అడ్డంగా మారాయని అందుకనే వీటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేస్తున్నామన్నారు.

సర్వీస్‌రోడ్డులో పార్కింగ్‌తో ఇబ్బందులు

మల్కాపురం: సర్వీసు రోడ్లలో ఆటోలు, వ్యాన్‌లను పార్కు చేస్తున్నారు. దీంతో ఆ మార్గాల్లో రాకపోకలు సాగించే వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గంలో తమ వాహనాలను పార్కు చేస్తూ మరుసటి రోజు ఉదయం తీస్తున్నారు ఆ సమయంలో అటువైపు వచ్చే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సమస్యపై మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

అడవివరం హైస్కూల్‌ను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు ట్యాబ్‌లు ఎలా వినియోగిస్తున్నారో అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులతో కొద్దిసేపు మాట్లాడారు. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేలా శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. నాడు–నేడు పనుల పురోగతిని పాఠశాల హెచ్‌ఎం ఇమంది పైడిరాజు వివరించారు. పదో తరగతిలో ఉత్తీర్ణత పెంచేలా స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సబ్జెక్టు ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని డీఈవోకు వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



మెట్ల మార్గం పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్‌కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులను శుక్రవారం వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పనులు వేగంగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. వార్డులో కోటి యాభై లక్షల రూపాయల అభివృద్ధి పనులను కూడా త్వరిగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యం వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దాడ ప్రసాద్, నూకరాజు, బాజ్జీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



లక్ష్మీనగరంలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సత్య



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దుర్గకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ సుజాత

విశాఖ విద్య: సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారం కూడా కొనసాగింది. జీవీఎంసీ 52, 90వ వార్డుల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. 90 శాతానికి పైగా పంపిణీ పూర్తయిందని సచివాలయ సిబ్బంది తెలిపారు. ఇళ్ల వద్దలేని వారిని గుర్తించి, నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వలంటీర్లు లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి ..

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీ సచివాలయానికి చెందిన వలంటీర్ దండి సుజాత కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పైడి దుర్గ (60) అనే మహిళలకు శుక్రవారం పింఛన్ నగదు అందజేశారు. దుర్గ కొన్ని రోజుల నుంచి కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఇది గమనించిన వలంటీర్ సుజాత శుక్రవారం సచివాలయ కన్వీనర్ దండి శ్యామ్‌తో కలిసి కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ నగదు అందజేసింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఇరువురిని అభినందించారు.

చెప్పారంటే.. చేస్తారంతే..



ఆసరా చెక్కు అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్, మళ్ల విజయప్రసాద్




కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్
- పండగలా సాగిన ఆసరా సంబరాలు

గోపాలపట్నం: జగనన్న మాట ఇచ్చారు ...చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త, ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో శుక్రవారం వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. నియోజకవర్గం పరిధిలోని ఏడు వార్డులకు చెందిన లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. గత పాలకులు ఏవిధంగా మోసం చేశారో అందరికీ తెలుసన్నారు. మళ్లీ వారు మూకుమ్మడిగా మోసం చేసేందుకు వస్తున్నారని.. వారిని నిలదీయాలన్నారు. జగనన్న అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ మనకు రావాలని అందుకు అంతా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. జీవీఎంసీ 52, 56, 57, 89, 90, 91, 92 వార్డుల్లో డ్వాక్రా గ్రూప్ అక్క చెల్లెమ్మలు 25 వేల మందికి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.23.20 కోట్లు అందించామన్నారు.

పార్టీ విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ ఇక్కడి ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో లేరన్నారు. పశ్చిమంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రహమాన్ మాట్లాడుతూ టీడీపీ నాయకులు, అధినాయకుడు మోసగాళ్లని.. వారిని నమ్మకూడదన్నారు. పశ్చిమ యోజకవర్గంలో మంచి చేసే నాయకుడిని గెలిపించుకోవాలని కోరారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి నానాజీ, నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, జియ్యాని మారుతి, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆడారి శ్రీనివాసరావు, నమ్మి వెంకటకృష్ణ మూర్తి యాదవ్, చుక్క ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు అండగా నిలిచారు



మహిళలకు ఆసరాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిలిచారు. డ్వాక్రా మహిళలకు విడతలవారీగా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. ఆ విధంగా నాలుగు విడతల్లో మాఫీ చేసిన గొప్ప నాయకుడు. ఆయనకు తామంతా అండగా నిలుస్తాం.

– గంటా కావ్య, గోపాలపట్నం


అతివల అభ్యున్నతికి కృషి



మహిళల అభ్యున్నతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి మా జగనన్న... గతంలో ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే డ్వాక్రా మహిళలకు ఈ ప్రభుత్వంలో తగిన గుర్తింపు గౌరవం వచ్చాయి. జగనన్న కృతజ్ఞతులమై ఉంటాం.

– అనురాధ, కరాసా

అన్నివిధాలుగా గౌరవం



మాకు అన్ని విధాలుగా గౌరవాన్ని ఇచ్చింది జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం. ప్రతి ఇంటిపెద్దగా ఆలోచించి మంచి చేస్తున్న నాయకుడు జగన్‌బాబు. డ్వాక్రా మహిళలకు ఆసరా ద్వారా నగదు బదిలీ చేసి చాలా మందిలో ఆత్మ విశ్వాసం కలిగించారు. మేమంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

–నారాయణమ్మ, గణేష్ నగర్

అప్పన్నను దర్శించుకున్న వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా



అధిర్ అరోరాకి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని భారత ప్రభుత్వ చీఫ్ హైడ్రోగ్రాఫర్ వైస్ అడ్మిరల్ అధిర్ అరోరా సతీసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి అందజేశారు.

పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

ఏయూ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఏపీ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ గుంటుబోయిన రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

4న బ్రాహ్మణుల ఐక్య సదస్సు

డాబాగార్డెన్స్: విప్రోత్సవం–2024 పేరిట ఈ నెల 4న గురజాడ కళాక్షేత్రంలో బ్రాహ్మణుల ఐక్య సదస్సు నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం కన్వీనర్ పీవీ నారాయణరావు, కార్మిక సంఘం నాయకుడు వీవీ వామనరావు తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో ఐక్యవేదిక సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9 గంటలకు నగర పరిధిలో గల బ్రాహ్మణ నేతల విగ్రహాలకు పూల మాలలతో నివాళులర్పించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద గల మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు విగ్రహానికి నివాళులర్పించి, గురజాడ కళాక్షేత్రం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో ఇటువంటి సదస్సు 1991లో నిర్వహించినట్లు గుర్తు చేశారు. బ్రాహ్మణుల ఆర్థిక, సామాజిక రంగాల్లో గల పరిస్థితులపై చర్చించనున్నట్లు వెల్లడించారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 2 లక్షల వరకు బ్రాహ్మణ ఓట్లు ఉన్నాయన్నారు. ప్రధాన పార్టీలు బ్రాహ్మణ నేతలకు టికెట్లు ఇవ్వాలన్నారు. ఎంవీ భద్రం, భాట్టం శ్రీరామ్మూర్తి, డీవీ సుబ్బారావు వంటి బ్రాహ్మణ నేతలు సుపరిపాలన అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నందూరి సుబ్రహ్మణ్యం, నరసింహమూర్తి, ఆకెళ్ల రమణమూర్తి, కావూరి చరణ్‌కుమార్, బి శంకర్ నీలు, వి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.